తుమ్ములూ?' అన్నాడు. ఒక పక్క నేనని తెలిస్తే చావబాత్తాడని భయం. ఇంకో పక్క తుమ్ములు నాన్న చెవులో పడ్డాయని సంబరం! కుక్కిన పేనులాగ కిక్కురుమనకుండా కూచున్నాను. ముక్కులో దురద వాదలక మళ్ళా తుమ్మొస్తూ ఉంటే ఓ బలవంతాన ఆపుకొని చచ్చాను. అంతా మొహమొహాలు చూసుకొన్నారు. విసవిస లాడారు.

'నయమే పెళ్ళికొడుకు పెళ్లికూతురూ వెళ్ళిపోయారు' అని సముదాయించుకొన్నారు.

'తుస్సుతుస్సుమని వెధవ తుమ్ములు. దిగండంతా బళ్లు' అన్నాడు మా నాన్న. గోలగోల అయిపోయింది. అందర్నీ దింపి అందరినీ కాళ్ళు కడుక్కోమని కూచోపెట్టారు.

"ప్రయాణానికి సిద్ధంగా ఉంటే బుద్ధీ జ్ఞానం లేకుండా ఎందుకూ తుమ్మేవు? నీ బుఱ్ఱ చితగ్గొట్టవలసింది" అన్నాడు మునిమనవడు.

"విను విను చెపుతుంది."అన్నాది మునిమనవరాలు. మనవడు అన్న మాట ముత్తవ్వకి మహాకోపం వచ్చింది. ఆనాడు వాళ్ళెవరో అన్నట్టు ఈనాడు మనవడు బుద్ధీజ్ఞానం లేదంటే ఉక్రోషం వొచ్చింది. పెద్ద గొంతుకతో పళ్లు కొరుక్కుంటూ మనవడిమీద విరుచుకుపడ్డాది.

"భడవా ఎందుకు తుమ్మేనా? నీ సొమ్మేం పోయింది. గండగత్తెర మాకొచ్చిపడ్డాది. ఇంత బొమ్మలపెళ్ళి చేశామా? పెళ్లికూతుర్నీ పెళ్లికొడుకునీ గృహప్రవేశానికి తీసుకెళ్లాలా? ఆ బొమ్మలు బొమ్మరింట్లో ఉండిపోయాయి. బండెక్కి మేం కూర్చున్నాము. దాంతో ప్రయాణం వో ఘడియ ఆగిపోయింది. దబ్బుదబ్బున బొమ్మరింట్లోకి పరిగెట్టేము. బొమ్మలు, సవారీ, మిగతా సరంజాము పెద్ద రంగురంగుల తాటేకుల బుట్టలో పెట్టి సిద్ధంగానే ఉంచాము. అది పట్టుకు పందిట్లోకి పరిగెట్టేము" అని ముత్తవ్వ ఎందుకు తుమ్మిందో చెప్పింది.

తుమ్ముల మాటైపోగానే క్షీరాన్నంలో ఏలకపళ్ళ వాసన ఘుమఘుమలాడుతూ వసారాలోకి వచ్చింది. వాళ్ళనాన్న దేవతార్చన మాత్రం "పాపాత్మా పాపసంభవా" లో పడి "రక్షరక్షో మహేశ్వరా" అనలేదు.